క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): ఆంధ్రాచెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అమేచూర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నంద్యాల ఎన్జీఓ కాలనీలోని శ్రీ చైతన్య విద్యాసంస్థ ఎన్-3 బ్రాంచ్‌లో సోమవారం ఆల్ కర్నూలు చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ హాజరై విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. నంద్యాలకు చెందిన హర్షవర్ధన్‌చారి మొదటి స్థానం, శ్రీనాథరెడ్డి రెండో స్థానం కైవసం చేసుకున్నారని, వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ జోనల్ ఆర్ఐ చౌదరి, ప్రిన్సిపాల్ మౌలాలబీ, వినయ్‌సాగర్, రాజారమేష్ చక్రవర్తి, ఆర్బిటర్లు ఇమామ్ హుసేన్, సుజాత, రవినాయక్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుడగ జంగం రాష్ట్ర నాయకులు తాటికొండ బుగ్గరాముడు, శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు, ఈద్ కిట్లు పంపిణీ చేశారు. ముస్లిం మత పెద్దలు హాజరైన సమావేశంలో దాదాపు 300 మంది మహిళలకు చీరలు, కిట్లు అందజేశారు.

నేడు ఒకేషనల్ పరీక్ష

ఉయ్యాలవాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఒకేషనల్ కోర్సు పరీక్ష మంగళవారం నిర్వహిస్తున్నామని చీఫ్ సూపర్ వైజర్ వెంకటశకుంతల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ పరీక్షకు 96 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు విద్యార్థులు పరీక్ష ఉంటుందని చెప్పారు.

పేదలకు సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ఆల్‌ఖైర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చాగమర్రిలో ఎస్ఐ రమణయ్య, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకులు అందజేశారు. పేద ముస్లింలు సంతోషంగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతోనే సరుకులను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అబ్దుల్ మజీద్ ఆరిఫ్, సలహాదారుడు మౌలానా అబ్దుల్, ఎంపీటీసీ ఫయాజ్, మార్కెట్‌యార్డు సభ్యుడు ముల్లా జాబీర్ పాల్గొన్నారు.

హైవే సర్వే పనులు ఆపాలి

నంద్యాల(రూరల్): కల్వకుర్తి–జమ్మలమడుగు నూతన జాతీయ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి జరుగుతున్న సర్వే పనులను నంద్యాల మండలం కానాల గ్రామం సమీపంలో రైతులు సోమవారం అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న నంద్యాల తహసీల్దార్ శ్రీనివాసులు రైతులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో సర్వే అధికారులు రైతులు చేస్తున్న ఆందోళనను ఉన్నతాధికారులకు తెలియజేసి వెనుదిరిగారు. తహసీల్దార్ మాట్లాడుతూ జాతీయ రహదారిని పొలాలల్లో కాకుండా గ్రామంలోనే వెళ్లేలా అధికారులు సర్వే చేయాలని, తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా పొలాల్లో సర్వే చేయడాన్ని ఆందోళన చేసి అడ్డుకున్నారని చెప్పారు. రైతులతో చర్చించి త్వరలోనే సర్వే చేపడుతామన్నారు. ఆర్ఐ యుగంధర్‌రెడ్డి, మండల సర్వేయర్ సహదేవుడు, జాతీయ రహదారి సర్వే అధికారులు ఉన్నారు.

సేవా స్ఫూర్తితో మెలగాలి

గోస్పాడు: విద్యార్థి దశ నుంచే సేవా స్ఫూర్తితో మెలగాలని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ శివశంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా చివరి రోజు ముగింపు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సోలార్ ఇరిగేషన్‌తో పాటు పలు రకాల నమూనాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి నారాయణరావు, పీడీ యశ్వంత్‌రెడ్డి, ఓఎస్ఏ సతీష్‌రాహుల్, ఏపీజీబీ బ్యాంక్ సిబ్బంది గోవిందరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సాధారణంగా ఆలస్యం..అమృతం.. విషం అంటారు. అయితే మధుర ఫలం విషయంలో మాత్రం ముందస్తు విషంగా మారుతోంది. వేసవిలో విస్తారంగా లభించే మామిడి పండు ప్రజల పాలిట హానికరంగా మారుతోంది. పక్వానికి రాని వాటిని నిషేధిత రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టి విక్రయిస్తున్నారు. ఎంతటి కచ్చి కాయ అయినా సరే ఆ రసాయనంతో మాగబెడితే ఒక్క రోజులోనే కంటికి ఇంపైన రంగుతో ఆకర్షించేలా మారుతుంది. వీటిని తింటే ప్రమాదకరమైన వ్యాధులు తప్పవని వైద్యులు చెబుతున్నారు.



మధుర ఫలం.. విషతుల్యం

- నిషేధిత రసాయనాలతో మాగపెడుతున్న వైనం
- రంగుతో బురిడీ కొట్టిస్తున్న వ్యాపారులు
- క్యాల్షియం కార్బైడ్ ప్రమాదకరమంటున్న వైద్యులు
- ఇథనాల్ గ్యాస్‌తో మాగబెట్టాలంటున్న అధికారులు

నంద్యాల(వ్యవసాయం): బంగారు వర్ణం.. సుమధుర సువాసన వెదజల్లే మామిడి పండును ఇష్టపడని వారుండరు. ఈ బలహీనతే.. వ్యాపారులకు కల్పతరువుగా మారింది. చెట్టుపై నుంచి కాయలను కోసి క్యాల్షియం కార్బైడ్ అనే విషపూరిత రసాయనంతో మాగబెట్టి ప్రజలకు విక్రయిస్తున్నారు. దీంతో పక్వం కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. కృత్రిమంగా మాగబెట్టడానికి వినియోగిస్తున్న నిషేధిత రసాయనాలు ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తాయని, ఎంతలా అంటే ప్రాణాంతకమైన క్యాన్సర్ లాంటి వ్యాధులకు కారణభూతమవుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పద్ధతిని నిషేధించినా కొనసాగిస్తుండటం గమనార్హం.

రూ.150 కోట్లకు పైగా వ్యాపారం..

నంద్యాల జిల్లాలో ఈ సీజన్‌లో రూ.150 కోట్ల మామిడి పండ్ల వ్యాపారం జరుగుతుంది. జిల్లాలో 9,250 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. బనగానపల్లె, బేతంచర్ల, వెలుగోడు, డోన్, బండిఆత్మకూరు, పాణ్యం, మహానంది, ఆళ్లగడ్డ, గడివేముల తదితర మండలాల్లో మామిడి తోటలను సాగు చేస్తూ వేసవి కాలంలో ఇక్కడి నుంచి హైదరాబాద్, కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు వంటి ప్రాంతాలకే కాకుండా ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నారు. ఎక్కువగా బేనీషా, హిమాయత్, దిల్‌పసంద్, మల్లూబా, రెడ్‌పసంద్, అమృతాలు, నాజుక్, లంగడ, కేసరి, దసరి, ఆల్‌ఫోన్స్, చిత్తూరు మామిడి, యంబాయి, చిన్నరసాలు, ఖాదర్, మితుషా తదితర రకాల పండ్లు లభిస్తున్నాయి.

ఇలా గుర్తించొచ్చు..

కృత్రిమంగా మాగిన వాటిని గుర్తించడానికి పరిశీలించాల్సిన అంశాల్లో మొదటిది కాయ రంగు రసాయనాలు ఉపయోగించి మగ్గబెట్టిన పండ్లు చూడటానికి పసుపు రంగులోనే ఉన్నా వాటిపై ఆకు పచ్చ రంగులో మచ్చలు కనిపిస్తుంటాయి, మరి కొన్నింటిలో సహజ సిద్ధంగా మాగినప్పుడు వచ్చే రంగు కంటే మరింత ప్రకాశవంతంగా కనిపిస్తుంది. సహజసిద్ధంగా పక్వానికి వచ్చిన పండు రంగు అంతా ఒకే విధంగా ఉంటుంది. సహజసిద్ధంగా మాగిన మామిడి నుంచి వచ్చే వాసన మధురంగా, తియ్యగా ఉంటుంది. కార్బైడ్ ఉపయోగించి మగ్గబెట్టిన పండ్ల నుంచి ఘాటైన వాసన వస్తుంటుంది. కొన్ని సందర్భాల్లో పండ్ల నుంచి ఎటువంటి వాసన రాకపోవడాన్ని కూడా గమనించవచ్చు. కృత్రిమంగా మగ్గ బెట్టిన పండును తింటునప్పుడు నోరు, గొంతులో మంట పెడుతున్నట్లుగా అనిపిస్తుంది. ఇలాంటివి తిన్న కొంత సమయం తర్వాత చాలా మందిలో కడుపునొప్పి, డయేరియా వంటివి వచ్చే అవకాశం కూడా ఉంది. అదే సహజ సిద్ధమైన పండు అయితే ఇలాంటి లక్షణాలు ఏవీ కనిపించవు. రుచిగా, తియ్యగా ఉంటుంది.

ఇలా చేద్దాం..

కృత్రిమంగా మాగబెట్టని పండ్లను కొనుగోలు చేసినప్పుడు తినడానిక ముందు ఒక టబ్బు నిండా మంచినీరు పోసి దానిలో గుప్పెడు ఉప్పు వేసి మామిడి పండ్లను అరగంట సేపు అందులో ఉంచాలి. తర్వాత వాటిని ఉపయోగికుంటే అనారోగ్య సమస్యలు కొంతమేర తగ్గుతాయి.

రిపైనింగ్ యూనిట్ల ద్వారా మగ్గబెట్టడం..

శాస్త్రీయ పద్ధతిలో రిపైనింగ్ యూనిట్ల ద్వారా మామిడి కాయలను మొదటి రోజు ఏసీల ద్వారా 20 నుంచి 24 సెంటిగ్రేడ్ వద్ద శీతలీకరించి తర్వాత రోజు నుంచి మూడు రోజుల పాటు ఇథలిన్ గ్యాస్‌ను పంపించి కాయలను మగ్గిస్తారు. ఈ కాయ పండుగా మారడానికి నాలుగు రోజుల సమయం పడుతుంది. ఇది శాస్త్రీయమైన పద్ధతి అని, ప్రజలకు ఎటువంటి అనారోగ్యం కలిగించదని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.



టెక్కె మార్కెట్ యార్డులోనున్న రిపైనింగ్ చాంబర్‌లో మామిడి పండ్లను కృత్రిమంగా మగ్గబెడుతున్న దృశ్యం

క్యాల్షియం కార్బైడ్‌తో అనర్థాలు



ఎన్నో అనర్థాలకు దారి తీసే క్యాల్షియం కార్బైడ్‌తో మగ్గించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వీటితో మగ్గించిన పండ్లను తినడం వల్ల జీర్ణకోశ, చర్మ వ్యాధులు, కళ్ల నుంచి నీరు కారడం, మతిమరుపు వంటి లక్షణాలు వస్తాయి. అలాగే కాలేయం, మూత్రపిండాలు సక్రమంగా పనిచేయకపోవడం, క్యాన్సర్ వంటి రోగాలకు గురవుతారు. ప్రజలు సహజ సిద్ధంగా పక్వానికి వచ్చిన పండ్లను మాత్రమే తినాలి. – డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్ఓ, నంద్యాల

అధికారులు అవగాహన కల్పించాలి



వ్యాపారులు కృత్రిమంగా మగ్గబెట్టి అమ్మే ప్రయత్నం చేస్తుంటారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఉద్యానవన శాఖ అధికారులతో గుర్తింపు పొందిన రిపైనింగ్ సెంటర్లలో సహజ సిద్ధంగా మగ్గబెట్టిన పండ్లను తినడం ద్వారా ఆరోగ్యానికి హాని కలుగదు.
– అల్తాఫ్, రిపైనింగ్ చాంబర్ యజమాని, నంద్యాల

స్పందన అర్జీలకు జవాబుదారీగా ఉండాలి

ఉయ్యాలవాడ: స్పందనలో వచ్చిన ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటూ సమస్యల పరిష్కారంలో అంకితభావంతో పని చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరైన అధికారులతో మాట్లాడారు. సచివాలయాల పరిధిలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వాటిని వెంటనే నమోదు చేయాలని చెప్పారు. హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో ఏఈలు నాగరాజు, రామకృష్ణారెడ్డి, ప్రణీత్‌కృష్ణ, గురప్ప, ఏపీఎం శేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్పందనకు వచ్చే ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ నాగఅనసూయ సూచించారు.



స్పందనలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓ

సోమవారం స్పందనలో పాల్గొన్న వారు మాట్లాడుతూ వీఆర్‌ఓలు, సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం మిషన్ వాత్సల్య కోసం ధ్రువపత్రాలకు వస్తున్నారని వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఏఓ శ్రీకృష్ణ, వీఆర్‌ఓలు సాంబశివుడు, సావిత్రి, నాగేష్ పాల్గొన్నారు.

మొబైల్ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(సిటీ): మొబైల్ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సోమవారం కోరారు. పట్టణంలో దాదాపుగా 40 వేల మంది ఇంకా ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోలేదని, వీరంతా ఆయా తేదీల్లో వార్డు సచివాలయాలలో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపులను ఆశ్రయించాలన్నారు. 18న దేవనగర్–2 (హరిజనవాడ, జగజ్జనని నగర్, ఎన్జీఓస్ కాలనీ), 19న దేవనగర్–2 (హరిజనవాడ, జగజ్జనని నగర్, లలితానగర్), 20 జ్ఞానాపురం, సలీం నగర్, బాల్కొండ హాల్, లలితానగర్, 26న దేవనగర్–1 (రామనాథరెడ్డినగర్, గుడిపాటిగడ్డ, నూనెపల్లె హరిజనవాడ), 27న దేవనగర్–1 (రామనాథరెడ్డి నగర్, గుడిపాటిగడ్డ,నూనెపల్లె హరిజనవాడ)లో సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ స్పెషల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుద్రవరం: మండలంలో మంగళవారం నుంచి ఆధార్‌లో చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆధార్ కార్డులు మంజూరు చేసినప్పుడు సరైన ఆధారాలు లేక కార్డుల్లో తప్పులు దొర్లాయని వాటిని సరి దిద్దేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 18,19,20,26,27 తేదీల్లో ఐదు రోజుల పాటు నిర్ణీత తేదీల ప్రకారం ఆయా గ్రామ సచివాలయాల్లో శిబిరాలు పనిచేస్తాయన్నారు. మార్పులు చేయించుకునేందుకు ఒరిజినల్ ఓటర్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి వాటిల్లో ఏదో ఒకటి తీసుకెళ్లాలని, ఇందుకు కేవలం రూ.50లు రుసుము మాత్రం చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

ఉయ్యాలవాడ : మండలంలో మంగళవారం నుంచి ఏర్పాటు చేయనున్న ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2010 నుంచి 2016 వరకు ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా ఆధార్ కార్డులు మంజూరు చేశారన్నారు. ఈ మధ్య కాలంలో ఆధార్‌కార్డులు పొందిన వారంతా అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. 18న ఇంజేడు, 19,20 బోడెమ్మనూరు, 26,27 తేదీల్లో ఆర్.జంబులదిన్నె గ్రామాల్లో శిబిరాలు పనిచేస్తాయన్నారు. మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని వివరించారు.

వేతన సవరణ అమలు చేయాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్రస్థాయి సహకార సంఘ ఉద్యోగులకు 2019 నాటి వేతన సవరణను వెంటనే అమలు చేయాలని సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వీరభద్రుడు, కార్యదర్శి సుబ్బారావు కోరారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నంద్యాల జిల్లా సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నూనెపల్లె జంక్షన్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జీవో నెం.36,90 ప్రకారం వేతనాలు, ఇతర బెన్‌ఫిట్స్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. సీఐటీయూ నాయకుడు నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకుడు లక్ష్మణ్ పాల్గొన్నారు.

జీవో రద్దు చేయాలి

ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చితే వెనుకబడిన గిరిజనులు అన్యాయమైపోతారని ప్రభుత్వం తెచ్చిన 52 జీవోను రద్దు చేయాలని ఏఐబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామినాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలానాయక్ కోరారు. ఆలిండియా బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌నాయక్ అధ్యక్షతన సోమవారం స్థానిక అబాండం తండా రహదారిలో రాస్తారోకో చేపట్టారు.

ప్రజల మన్ననలు పొందినప్పుడే తృప్తి





మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు

ఉయ్యాలవాడ : ప్రజలకు తమ శాఖా పరంగా మంచి సేవలు చేసి ప్రజలతో మన్ననలు పొందినప్పుడే తృప్తి ఉంటుంది, అలా సేవలు చేసేందుకు మీ అందరి సహకారం ఎంతో అవసరమని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో నేడు జీవనసరళి మారింది, ప్రశాంతంగా జీవనాన్ని గడిపేలా తమ అభిరుచులను మార్చుకున్నారు. గొడవలకు దూరంగా ఉండి, పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. కుటుంబ వృద్ధికి పాటుపడితే ఉన్నత స్థానంలో ఉంటుందని, మీరు, మీ పిల్లల భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని చెప్పారు. పోలీస్ శాఖలో పని చేసే వారికి ఏ రాజకీయ పార్టీ నాయకుడైనా సంబంధం ఉండదని, మీరు పార్టీలు మారవచ్చేమో కానీ పోలీస్.. పోలీస్‌గానే ఉంటారనేది గుర్తు పెట్టుకోవాలన్నారు. ఏ రాష్ట్రంలో నియమించని మహిళా పోలీస్ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాలను అరికట్టడంలో వారు కీలకంగా పనిచేస్తున్నారని, అలాంటి వారిని అగౌరవపరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, ఏఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే పథకాలు

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- అహోబిలంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధురాలికి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అహోబిలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలను వింటూ, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ లబ్ధిదారులకు బుక్‌లెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల నుంచి తమకు అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. మంచి చేస్తేనే ఇది సాధ్యమవుతుందని, తమ ప్రభుత్వం మంచి చేసింది కాబట్టే తమను ఆదరిస్తున్నారన్నారు.కుల మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలను తలుపు తట్టి వలంటీర్లు అందజేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ధరలు పెరిగాయని టీడీపీ నాయకులు గొంతులు చించుకోవడం ఆపి.. దేశ వ్యాప్తంగా ధరల గురించి తెలుసుకోవాలని, కేవలం మన రాష్ట్రంలోనే పెరిగినట్లు చెబుతుండటం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. మన పక్కనున్న ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణలో కూడా ధరలు పెరిగాయని, ఇవి ఎలా పెరిగాయో, ఎందుకు పెరిగాయో ప్రజలకు వివరించకుండా వాటికి కూడా జగనన్ననే కారకుడని చెప్పడం అవివేకమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చేపడుతున్నామన్నారు. గతంలో చంద్రబాబునాయుడు హామీలన్నీ తుంగలో తొక్కి ప్రజలను నిలువునా మోసం చేయడంతోనే వారు కర్రు కాల్చి వాత పెట్టారని, మరో సారి మోసపూరిత మాటలతో ప్రజల ముందుకొస్తే ఆ పార్టీ శాశ్వతంగా భూస్థాపితమయ్యేలా చేస్తారన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా సాగుతుందన్నారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహప్రసాద్, సర్పంచ్ నాసారి వీరమ్మ, నాయకులు నాసారి వెంకటేశ్వర్లు ,గంగుల విజయసింహారెడ్డి, రామచంద్రుడు, మధు, మద్దిలేటి, అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని 26వ వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్ కోరారు. స్థానిక శ్యాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పలువురు గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు ఆశీర్వాదమ్మ, విమల, మహిళా కానిస్టేబుల్ మాబున్ని, ఆయా పద్మావతి పాల్గొన్నారు.

గాజుల సురేఖకు డాక్టరేట్

నంద్యాల(అర్బన్): అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ నుంచి భౌతిక శాస్త్ర విభాగంలో గాజుల సురేఖ డాక్టరేట్ పట్టాను సోమవారం అందుకున్నారు. బ్యాటరీల శక్తి సామర్థ్యం పెంచేందుకు సంబంధించి ప్రొఫెసర్ రవి పర్యవేక్షణలో ఫ్యాబ్రికేషన్ క్యారెక్టరైజేషన్, పర్ఫార్మేషన్ అనాలసిస్ ఆఫ్ రెడ్ యూజ్డ్ గ్రాఫిన్ ఆక్సైడ్ నానో కాంపోజిట్ అనోడ్ బేస్డ్ లిథియం అయాన్ బ్యాటరీస్ మీద చేసిన పరిశోధనలకు యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం సాయిబాబానగర్ ఆర్చ్ వద్ద నిరసన వ్యక్తం చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘురామమ్మూర్తి, సుంకయ్య మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగం, కమ్యూనిస్టు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం అన్యాయమన్నారు. ఉద్యోగ కార్మిక సంఘాలు రెండేళ్లుగా సామూహిక నిరాహార దీక్ష చేస్తున్నా పట్టించుకోకుండా ప్రైవేటీకరణ వైపే మొగ్గు చూపడం దుర్మార్గమన్నారు. నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, సోమన్న, సుబ్బరాయుడు, సురేష్ పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో వెలిసిన శ్రీ కామేశ్వరి, మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్థానిక అలంకార మండపంలో ఉత్సవమూర్తులకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహా మంగళహారతులు, అలంకార పూజలు చేపట్టారు. అనంతరం నాలుగుదిక్కుల్లో బలిహరణ పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవం జరిపారు. వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



మహానందిలో పల్లకిసేవ దృశ్యం

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛారణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాధికాల అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులు గావించి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

నంద్యాల(అర్బన్): పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న సుజల పైప్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు అగ్నిప్రమాదాల నివారణపై జిల్లా అగ్నిమాపక అధికారి జయన్న అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రదర్శన ద్వారా వివరించారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: విద్యార్థులు అగ్నిప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండాలని అగ్రిమాపక అధికారి వీరారెడ్డి తెలిపారు. స్థానిక కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో విద్యార్థులకు ప్రమాదాల నివారణపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.



డెమో ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారానికి కృషి

ఆళ్లగడ్డ: చెక్కతో వివిధ రకాల బొమ్మలు, ఫర్నీచర్‌లు తయారు చేస్తున్న కళాకారుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి (లేపాక్షి) కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ఆచారి కాలనీలో చెక్కతో వివిధ రకాల వస్తువులు, గృహోపకరణాలు తయారు చేస్తున్న వారిని సంప్రదించి వస్తువులను పరిశీలించారు. కర్నూలు లేపాక్షి ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి ఉన్నారు.



ఆచారులతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు ఇద్దాం

నంద్యాల(అర్బన్): అమ్మ ఒడి, విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, పుస్తకాలు, ఇంగ్లిష్ మీడియం విద్య, విద్యాదీవెన, వసతి దీవెన తదితర అనేక పథకాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు ఇద్దామని వైఎస్సార్‌సీపీ 15వ వార్డు ఇన్‌చార్జ్ సన్నల సాయిరాంరెడ్డి కోరారు. పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులకు రావూస్ కళాశాలలో పథకాలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్దతు ఇవ్వాలనుకొనే వారు 82960 82960కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు.



మాట్లాడుతున్న సాయిరాంరెడ్డి